# 57. కోట్పులి నాయనారు

కోట్పులి నాయనారు వెల్లాలకులస్తుడు. చోళరాజు యొక్క ప్రధాన సైన్యాధికారి. పరమశివభక్తుడు. మహా పవిత్రుడు. సచ్ఛీలవంతుడు. తన ఆదాయములోనుంచ ధాన్యము కొన్ని అన్ని శివాలయములకు నివేదనకు పంపేవాడు. ఇది చాలకాలము చేశాడు.

ఒక రోజున తన ఉద్యోగ ధర్మముమీద కొంతకాలం బయటకు వెళ్లాల్సి వచ్చింది. అందుకని అన్ని శివాలయాలకు వలసినంత ధాన్యము కొన తన బంధువుల కప్పజెప్పి వెళ్లాడు. బంధువులకు ముందరనే నిర్దుష్టముగా చెప్పాడు. “ఈ ధాన్యము దేవాలయములకే. మీరెవ్వరు స్వంతానికి దీనిని ముట్టుకొనగూడదు” అని. కోట్పులి నాయనారు లేని సమయంలో కరువు వచ్చి పడింది. ఎవరికి ఆహారము దొరకలేదు. అందుకని దేవుని ధాన్యమును వారు ఆకలి తీర్చుకొనుటకుపయోగించారు. నాయనారు తిరిగి రాగానే విషయం విన్నాడు. వారిమీద చాలకోపం వచ్చింది. ఈ మహాపరాధానికి వాళ్లందరిని ఇంటికి పిలిపించి చంపించేశాడు. అందులో తన తల్లిదండ్రులున్నా వారిని గూడ క్షమించలేదు. దేవునిమీద నున్న అపారభక్తితత్పరత ఆయనచేత ఇంత పని చేయించింది. శివునిమీద వున్న అపార ప్రేమముందు తల్లిదండ్రుల బంధువులయెడ ప్రేమ గణనలోనికి రాలేదు. మహాదేవుడు ఈ అనుపమ నిరతిశయభక్తికి చలించి పోయాడు. ప్రత్యక్షమయి నాయనారుకి అతని చేతిలో చనిపోయిన బంధువులందరికి మోక్షమనుగ్రహించి తన లోకానికి తీసికొని వెళ్లాడు.